మహిళ లకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

కోటగడ్డలో అంతర్గత రహదారుల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, మార్చి 11 : స్వయం ఉపాధి వైపు మహిళలు అడుగు వేసేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని పస్రా, కోటగడ్డ గ్రామాల్లో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లు, అంతర్గత పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతీ మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం మండలంలోని ప్రాథమిక పాఠశాలలో దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాభివృద్ధిపై పలు కార్యక్రమాలు నిర్వహించగా వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మంత్రి ముచ్చడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీఈ ధర్మేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే సర్కారు ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వరికోలపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

చిట్యాల/ భూపాలపల్లి రూరల్, మార్చి 11 : గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఆయన చిట్యాల మండలంలో రూ.9.10 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండల కేంద్రం శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్యాల మండలానికి చెందిన 14, టేకుమట్ల మండలానికి చెందిన 34 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. అలాగే భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి మండలంలోని 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో భూపాలపల్లి పుర పాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. వేర్వేరుగా జరిగి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న రోజుల్లో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు అందజేస్తామన్నారు. ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా మన భూపాలపల్లికి అవకాశం లభించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ, ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లుగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, చిట్యాల మండల అధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, టేకుమట్ల మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కామెడి రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్దతు ధరల చట్టం చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

ములుగురూరల్, మార్చి 11 : పార్లమెంట్‌లో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని కలెక్టరేట్ ఎదుట మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కమిటీ సభ్యులు తుమ్మల వెంకట్‌రెడ్డి, ఎండీ గఫూర్‌పాషా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తీగల ఆగిరెడ్డి, గుండు రామస్వామి, కొర్ర రాజు, కన్నోజు సదానందం, పీఏసీఎస్ డైరెక్టర్, నిర్మల, భిక్షం, దబ్బకట్ల పాణి, కుందూరు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి గజవాహన సేవ

గజ వాహనంపై ఊరేగుతున్న నరసింహస్వామి

రేగొండ, మార్చి 11 : కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి గజవాహన సేవ, సాయంత్ర చంద్ర ప్రభ వాహన వంటి సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఆలయ మాడ వీధుల గుండా ఊరేగించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, మార్చి 11: హత్య కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఎస్పీ వెల్లడించారు. కాటారం మండలం గంగారం గ్రామంలో మారుపాక అశోక్, మారుపాక నాగరాజు అన్నదమ్ములు. వీరికి ఇంటి స్థలం ఉండగా అశోక్ (నిందితుడు), అతడి అన్న మారుపాక నాగరాజు (మృతుడు), తల్లి మారుపాక శంకరమ్మ సమానంగా పంచుకున్నారు. తన వాటాకు వచ్చిన స్థలంలో నాగరాజు చిన్న ఇల్లు నిర్మించుకున్నాడు. నిందితుడు అశోక్ తాగుడుకు అలవాటుపడి తన వాటాకు వచ్చిన భూమిని అమ్ముకొని ఖర్చు చేసుకున్నాడు. అప్పటి నుంచి అశోక్ తన అన్న నాగరాజు కట్టుకున్న ఇంటిలో వాటా వస్తుందని ఇబ్బందులకు గురి చేస్తూ చంపుతానని బెదిరించగా అతను కుటుంబంతో సహా వేరే గ్రామానికి వెళ్లి బతుకుతున్నాడు. 2019 మే 10 న ఎంపీటీసీ ఎన్నికల్లో భాగంగా ఓటు వేయడానికి నాగరాజు గంగారం రాగా అశోక్ ఇంటి స్థలం విషయంలో గొడవపడ్డాడు. బీరు బాటిల్ పగులగొట్టి నాగరాజు గొంతులో పొడవగా మృతిచెందాడు. మృతుడి భార్య మారుపాక సరిత కాటారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి హెడ్ కానిస్టేబుల్ మహేందర్ నిందితునిపై హత్య కేసు నమోదు చేశాడు. అప్పటి కాటారం సీఐ శివప్రసాద్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయన తర్వాత వచ్చిన సీఐ హతిరామ్ దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్ట్ లైజన్ ఆఫీసర్ ఏఎస్సై గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుళ్లు కే రమేశ్, కే వినోద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువైనందున మంగళవారం భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు నిందితుడికి జీవిత ఖైదు, రూ.పదివేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, అప్పటి దర్యాప్తు అధికారులను ఎస్పీ అభినందించారు.

జాదరావుపేటలో భూసేకరణ గ్రామసభ

కాటారం, మార్చి 11 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని జాదరావుపేట పెద్ద చెరువు కట్ట విస్తరణ కోసం 5.16 ఎకరాల భూ సేకరణపై మంగళవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ప్రతిపాదిత భూ సేకరణ రైతుల వివరాలు చదివి వినిపించారు. పలువురు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. తమ భూములకు పరిహారం మరింత పెంచాలని రైతులు అధికారులను కోరారు. భూమికి బదులు మరో చోట భూమి ఇవ్వడంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని అభ్యర్థించారు. అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ రైతులకు సూచించారు. సభలో తహసీల్దార్ నాగరాజు, ప్రత్యేక నాయబ్ తహసీల్దార్ శివ, షఫీ, నీటి పారుదల శాఖ ఏఈఈ వెంకన్న, భూ సేకరణ కార్యాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

భూపాలపల్లి రూరల్, మార్చి 11 : క్రీడలు మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మహిళలకు క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ ఓటమి చెందితే బాధపడొద్దని, గెలుపు వస్తే ఉప్పొంగి పోవద్దని, ప్రతి దానిలో గెలుపోటములు సహజమన్నారు. సీడీపీవో రాధిక, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యలపై ఫిర్యాదుకు కాల్ సెంటర్

కృష్ణకాలనీ, మార్చి 11 : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని భూపాలపల్లి పట్టణ ప్రజలకు నీటి సమస్యలు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు నీటికి సంబంధించిన ఫిర్యాదులు, వినతుల కోసం మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్ 89781 80036ను ఏర్పాటు చేశామని కమిషనర్ బిర్రు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ప్రజలు సమస్యలను ఈ నంబర్‌కు సమాచారమిస్తే త్వరగా తీరుస్తామని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇండ్లు దగ్ధం

మల్హర్, మార్చి 11 : విద్యుదాఘాతంతో మండలంలోని తాడిచర్లలో మంగళవారం రెండు ఇండ్లు దగ్ధమయ్యాయి. ఇందారపు కుమార్ ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టు పక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ, మంటలు ఎగిసి పడడంతో పక్కనే ఉన్న కుమార్ తమ్ముడు రవి ఇంటికి కూడా మంటలు అంటుకోగా స్థానికులు అదుపులోకి తెచ్చారు. కాగా, ఇందారపు కుమార్ ఇళ్లు పూర్తిగా కాలి పోయి సుమారు రూ.15లక్షల ఆస్తి నష్టం జరిగింది. రవి ఇళ్లు పాక్షికంగా కాలిపోగా రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. వివరాలు తెలుసుకొని తక్షణ సాయం కింద బియ్యంతో పాటు వంట సామగ్రి అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు సూచించారు. ఆయన వెంట వీఆర్వో మహేశ్, సిబ్బంది ఉన్నారు.

రూ.9కోట్లతో జాతీయ రహదారికి మరమ్మతులు

వాజేడు, మార్చి 11 : మండలంలోని కడెకల్ గ్రామ శివారు నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన లొటపిటగండి వరకు గల జాతీయ రహదారి మరమ్మతుకు రూ.9కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు 13కిలోమీటర్ల వరకు జాతీయ రహదారికి మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. లేయర్ల వారీగా కడెకల్ గ్రామం నుంచి గ్రామశివారు వరకు రహదారిపై బీటీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 13కిలోమీటర్ల వరకు రహదారిపై మళ్లీ బీటీ నిర్మాణం కొనసాగుతుందని ఎన్‌హెచ్ జేఈఈ రామ్మూర్తి తెలిపారు.

ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

గవర్నర్‌కు విన్నవించిన ఆదివాసీ సంఘాల నాయకులు

గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ములుగురూరల్/ వెంకటాపురం (నూగూరు)/ తాడ్వాయి, మార్చి11 : ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు ప్రభుత్వ అన్యాయం చేస్తున్నదని, ఆదివాసీల హక్కులను కాపాడాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మంగళవారం వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ చట్టాల ఉల్లంన జరుగుతున్నదని, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలను ఆదివాసీలకే ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ జనరల్ నోటిఫికేషన్ ఇచ్చి తీరని అన్యాయం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 317 నూతన జోనల్ విధానాన్ని మినహాయించాలని కోరారు. ఐటీడీఏ ద్వారానే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. 5వ షెడ్యూల్‌లోని జీవోలను అన్ని కలిపి ఆర్డినెన్స్‌ను తయారు చేసేలా కృషి చేయాలని కోరారు. ఆదివాసీ నాయకులు మైపతి అరుణ్‌కుమార్, వట్టం ఉపెందర్, రవి, నరసింహమూర్తి, గణేశ్, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్, సుభద్ర ఉన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మంగళవారం తాడ్వాయి పర్యటన సందర్భంగా ములుగు జిల్లా కేంద్రానికి రాగా మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గవర్నర్‌కు మంత్రి పూల మొక్క అందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ దివాకర, ఎస్పీ పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్‌జాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్ సైతం గవర్నర్‌కు మొక్కలను అందించారు. అనంతరం గవర్నర్‌కు పోలీసులు గౌవర వం దనం సమర్పించారు. అలాగే బాండ్ మక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిప్రతం అందజేశారు. నాయకులు రాంబాబు, ప్రవణ్,మధు, ధన, సారయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆవుదూడపై పులి దాడి !

పులి దాడిలో మృతి చెందిన ఆవు దూడ

కాటారం, మార్చి 11 : మండలంలోని జాదరావుపేట పరిధి రఘుపల్లి పొలాల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆవుదూడపై పులి దాడి చేసింది. మంగళవారం ఉదయం అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పశువుల కాపరులు ఆవు దూడ మృతి చెంది ఉండడాన్ని గమనించి గ్రామస్తులకు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో దామెర కుంట సెక్షన్ అధికారి చంద్రశేఖర్ నేతృత్వంలో అటవీ ప్రాంతానికి వెళ్లిన అధికారులు పలు చోట్ల పులి పాదముద్రలను గుర్తించారు. ఆవుపై పులి దాడి చేసి ఉంటుందని భావించి పులి ఆచూకీ కోసం నాలుగు ట్రాప్ కెమెరాలను అమర్చినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పులి కదలికలు కాటారం, మహదేవపూర్ ప్రాంతంలోనే ఉండడం, ఆవు దూడపై దాడికి పాల్పడడంతో సమీప అటవీ గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అడవుల్లోకి ప్రజలు వెళ్లొద్దని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

మహదేవపూర్, మార్చి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలతోపాటు పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని అన్నారు.

అనంతరం డీటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడక మధు, ప్రధాన కార్యదర్శిగా సారంగపాణి, ఉపాధ్యక్షులుగా తిరుపతి, రజిత, శ్రీకాంత్, శ్రీధర్, కార్యదర్శులుగా సాయి కుమార్, సంతోష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, సాంబయ్య, సాయికృష్ణ, జిల్లా కౌన్సిలర్లుగా బీ తిరుపతిరెడ్డి, దేవేంద్ర, వీరేశం, ప్రభాకర్‌రెడ్డి, మొండయ్య, భిక్షపతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎర్రయ్య, సభ్యులుగా రామ్మూర్తి, కల్యాణి, మినహాజ్ అలీ, హరీశ్, లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా లక్ష్మణ్‌నాయక్, ఎన్నికల అధికారిగా బీ తిరుపతిరెడ్డి వ్యవహరించారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

ఏటూరునాగారం, మార్చి11 : సీపీఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న ముగ్గురు సభ్యులు మంగళవారం ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఏఎస్పీ వారి వివరాలు వెల్లడించారు. మావోయిస్టు పార్టీకి చెందిన చెర్ల శబరి ఎల్‌వోసీ పార్టీ సభ్యుడు కడితి ఇడుమ అలియాస్ దేవ, ఛత్తీస్‌గఢ్ తడపాల ఆర్‌పీసీ కమాండర్ మిడియం దేవయ్య, వెంకటాపురం చర్ల శబరి ఎల్‌వోఎస్ పార్టీ సభ్యుడు సోడి జోగ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలతో విసిగిపోయి జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు లొంగిపోయినట్లు తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు సైతం పోలీసుల ఎదుట లొంగిపోయి కుటుంబాలతో సంతోషంగా జీవించాలని ఆయన సూచించారు. సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్, సీఐ బండారి కుమార్, ఎస్సై తిరుపతిరావు ఉన్నారు.

మక్కజొన్న శాంపిల్స్ సేకరణ

వెంకటాపురం(నూగూరు), మార్చి 11 : వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాండ్ మక్కజొన్న విత్తనాల శాంపిల్స్ సేకరించారు. కొంత కాలంగా మక్కజొన్న బీటీ విత్తన పాగు జరుగుతుందనే రైతుల ఆందోళన నేపథ్యంలో విత్తనాలు, ఆకులను ఏటూరునాగారం ఏడీఏ అవినాశ్‌వర్మ ఆధ్వర్యంలో సేకరించారు. సేకరించిన విత్తనాలను సీజ్ చేసి పరీక్షల కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు వ్యవసాయశాఖ ఏవో నవీన్ తెలిపారు. వాజేడు వ్యవసాయ అధికారి మహేశ్, ఏఈవోలు శ్యామ్, జాఫర్, హరీశ్, కల్యాణి ఉన్నారు.

హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

ఏటూరునాగారం, మార్చి 11 : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా హర్యానా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల హర్యానా వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ ఇన్‌చార్జి సూర్యం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్ష

భూపాలపల్లి రూరల్, మార్చి 11: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం గణితం, వృక్షశాస్త్రము, పౌరశాస్త్రము పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో 1,954 మంది విద్యార్థులకు 1,850 మంది హాజరయ్యారన్నారు. 104 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

దళిత బంధు నిధులు విడుదల చేయాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు లబ్ధిదారుల వినతి

కాటారం/ మల్హర్, మార్చి 11 : దళిత బంధు పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని కాటారం సబ్ డివిజన్ పరిధిలోని లబ్ధిదారులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. కాటారం, మల్హర్, మహదేవపూర్, మహాముత్తరం మండలాలకు చెందిన లబ్ధిదారుల రెండో జాబితాను వెంటనే విడుదల చేసి యూనిట్లను పంపిణీ చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంపత్ మహరాజ్, వేమునూరి జక్కయ్య, చకినారపు చందు, పాగె సంతోష్, దేవేందర్, గడ్డం సమ్మయ్య ఉన్నారు.

చెల్పూర్ పాఠశాలను పరిశీలించిన ఆర్జేడీ

గణపురం, మార్చి 11: మండలంలోని చెల్పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం పాఠశాల విద్య వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. గణిత శాస్త్రం ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు, ఎల్ఐపీ , ఎస్ఎస్సీ, ఎండీఎం, ఎస్ఎస్సీ విద్యార్థులకు అందించిన స్నాక్స్, పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సేఫ్టీ, సెక్యూరిటీ హెల్ప్ లైన్ నంబర్లను చూసి అభినందించారు. ఆర్జేడీ అడిగిన అన్ని వివరాలను హెచ్ఎం కే అశోక్ అందించారు. వీ సత్యనారాయణ, జ్యోతి, బాబూరావు పాల్గొన్నారు.

మహిళ లకు వైద్య పరీక్షలు

వెంకటాపురం(నూగూరు), మార్చి 11 : మండలంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం వైద్యాధికారిణి భవ్యశ్రీ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 84మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి స్నేహారెడ్డి, హెచ్ఈవో సత్యనారాయణ, హెచ్‌వీ రామకృష్ణ, యాకలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల బియ్యాన్ని పట్టుకున్న గ్రామస్తులు

వెంకటాపురం (నూగూరు), మార్చి11 : మండలంలోని బర్లగూడెం జీపీ పరిధి చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి సోమవారం రాత్రి వర్కర్లు అక్రమంగా బియ్యం తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. పాఠశాల నుంచి ట్రాక్టర్‌లో మూడు బస్తాల్లో బియ్యం తరలిస్తుండగా గమనించి ట్రాక్టర్‌ను అడ్డుకోవడంతో పాఠశాల ఎదుట బియ్యం, ట్రాక్టర్‌ను వదిలి వెళ్లారని తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని హాస్టల్‌కు తరలించినట్లు చెప్పారు. అయితే పట్టుకున్న బియ్యం హాస్టల్‌కు చేరాయా? లేక బయటకు తరలించారా? అనేది తెలియాల్సి ఉంది.

మినీ గురుకులం హాస్టల్ పరిశీలన

వాజేడు, మార్చి 11 : కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశాల మేరకు మండలంలోని జంగాలపల్లి మినీ గురుకులం బాలికల హాస్టల్‌ను మంగళవారం ఎంపీవో శ్రీకాంత్ నాయుడు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకొని హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. బాత్రూంల నుంచి వెళ్లే నీరు జామ్ అవడాన్ని గమణించి దానికి మరమ్మతులు చేసి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్ సూజాతకు సూచించారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఏటూరునాగారం, మార్చి11 : ఆకులవారిఘనపూర్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ బస్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన శెట్టి నరేశ్ మంగళవారం ఏటూరునాగారం వస్తున్నాడు. ఈక్రమంలో ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్ యాటర్న్ తీసుకుంటుండగా నరేశ్ బైక్ అదుపుతప్పి బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టాడు. దీంతో కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వై ద్యం కోసం ములుగు తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య అమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ఉన్న వారిని విడుదల చేయాలి : పౌరహక్కుల సంఘం

వాజేడు, మార్చి 11 : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన ఇల్లందుల విజయ్, తీగారం గ్రామానికి చెందిన నాగరాజును మంగళవారం వాజేడు పోలీసులు ఉదయం పది గంటల సమయంలో అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ పౌరహక్కుల సంఘం– తెలంగాణ పేరిట పత్రిక ప్రకటన విడుదలైంది. మంత్రి సీతక్క చొరవ తీసుకొని విడిపించాలని లేఖలో డిమాండ్ చేశారు. వారిద్దరిని పోలీసులు గుట్టల చుట్టూ తిప్పుతూ ఎన్‌కౌంటర్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ర